ముఖ్యమంత్రికి బీజేపీ ఎమ్మెల్యే క్షమాపణలు

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు బీజేపీ ఎమ్మెల్యే, ప్రతిపక్ష ఉపనాయకుడు అరవింద బెల్లద్ మంగళవారం క్షమాపణలు చెప్పారు. జిందాల్ కంపెనీకి తక్కువ ధరకే భూములు కేటాయించిన విషయమై ప్యాలెస్ గ్రౌండ్స్‌లో మీడియాతో మాట్లాడినవేళ అరవింద్‌బెల్లద్ తీవ్రమైన వ్యాఖ్యలు చేశారు. తక్కువ ధరకు ఇచ్చేందుకు భూములు ఏమైనా సిద్దరామయ్య తండ్రి ఆస్తులా..? అని మండిపడ్డారు. దీనిపై తీవ్ర విమర్శలు రావడంతో బెల్లద్ ఓ లేఖ ద్వారా క్షమాపణలు చెప్పారు. తన వ్యాఖ్యలు తనకే సమంజసం అనిపించడం లేదని, అందుకే క్షమాపణలు చెబుతున్నా అని పేర్కొన్నారు.

అతిథి కష్టాలు..!





- విద్యాశాఖలో 'గెస్ట్ టీచర్ల' అవస్థలు
- కేజీ నుంచి పీజీ దాకా వారి బోధనలే
- ప్రభుత్వాల నిర్లక్ష్యం
- కనీస వేతనాలు లేక దుర్భర జీవనం

గ్యారెంటీల పేరుతో గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం విద్యాశాఖ పట్ల తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ఏటేటా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పడిపోతోంది. గత కొన్ని దశాబ్దాలుగా ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలే ఇందుకు కారణం. ఉపాధ్యాయులను నియమించి విద్యాబోధన సక్రమంగా నిర్వహించాల్సిన ప్రభుత్వం విద్యాశాఖను పట్టించుకోలేదు. రెగ్యులర్‌గా ఉపాధ్యాయులను నియమించడం మానేసింది. 'గెస్ట్ టీచర్' పేరుతో తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తూ విద్యా సంవత్సరాన్ని నెట్టుకొస్తోంది. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల నుంచి యూనివర్సిటీ ప్రొఫెసర్ల వరకూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఉపాధి కూలీలకు వచ్చే కూలి కంటే వేతనాలు తక్కువ ఉన్నాయని గెస్ట్ టీచర్లు వాపోతున్నారు.

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యాశాఖ అస్తవ్యస్తంగా మారింది. తగినంతమంది ఉపాధ్యాయులు లేక చదువులు సక్రమంగా సాగడం లేదు. ఏటా నియమించుకునే అతిథి (గెస్ట్) ఉపాధ్యాయులే దిక్కు అవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్నామని చెప్పుకోవడమే గానీ వారికి కనీస జీవనానికి అవసరమైనంత వేతనాలు అందడం లేదు. జైళ్లలో ఖైదీకి దినసరి కూలి రూ.520గా ఉంది. పల్లె ప్రాంతాల్లో ఉపాధి కూలికి రోజుకు రూ. 349 చెల్లిస్తున్నారు. అతిథి ఉపాధ్యాయులకు చెల్లించేది రోజుకు రూ.333 మాత్రమే. అతిథి ఉపాధ్యాయులుగా, అధ్యాపకులుగా పనిచేసేవారికి బీఏ, బీఈడీ, డీఈడీ, పీజీ విద్యార్హతలు తప్పనిసరిగా ఉండాలి. వీరు నెట్, కే-సెట్ లాంటి పరీక్షల్లోనూ ఉత్తీర్ణులై ఉంటారు. వేతనం మాత్రం తక్కువేనని ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో గెస్ట్ బోధకుల నుంచే రెండు దశాబ్దాల కాలంగా విద్యావ్యవస్థను నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం కొన్నిశాఖలకు భారీగా నిధులు విడుదల చేస్తున్నా భావిభారత పౌరులను తీర్చిదిద్దే ఉపాధ్యాయుల పట్ల మాత్రం కనీసమైన స్థాయిలో కూడా దృష్టి సారించడం లేదు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత, మౌలిక సదుపాయాలు లేకపోవడం వంటి కారణాలతో అడ్మిషన్లు ఏటా తగ్గిపోతున్నాయి. ఇలా గెస్ట్ టీచర్ల పట్ల నిర్లక్ష్యం చేస్తే రానున్న రోజుల్లో మరింత గడ్డుకాలమే రానుందని తెలుస్తోంది. ఈ విద్యా సంవత్సరం ప్రాథమిక పాఠశాలల్లో 33,863 మంది, హైస్కూళ్లలో 8,954 మంది సబ్జెక్టు టీచర్ల కొరత ఉంది. వీటిని అధిగమించేందుకు ప్రాథమిక పాఠశాలకు 34,600 మందిని, హైస్కూళ్లకు 10వేల మందిని నియమించుకున్నారు. కావలసిన దానికన్నా అదనంగా తీసుకున్న గెస్ట్ టీచర్లను ఏకోపాధ్యాయ పాఠశాలలకు, హైస్కూళ్లలో అవసరమైన చోటుకు సర్దుబాటు చేశారు. ఇదే గెస్ట్ విధానం పీయూ, డిగ్రీ కళాశాలతోపాటు యూనివర్సిటీలకు విస్తరించింది. ఇలా రాష్ట్ర విద్యావ్యవస్థ అతిథి బోధనా విధానంగా మారిపోయింది. అన్ని సౌలభ్యాలు కల్పించి ఇంటి వద్దకు వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చాలన్నా తల్లిదండ్రులు వెనుకడుగు వేస్తున్నారు. తమ పిల్లలను బాగా చదివించాలనే తపనతో పల్లె, పట్నం అనే తేడా లేకుండా లక్షల రూపాయల ఫీజులు, డొనేషన్లు కట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే గెస్ట్ టీచర్లకు గౌరవంగా వేతనం ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచించడం లేదు. తగిన సౌలభ్యాలు కల్పించడం లేదు. ఇలా అయితే ప్రైవేట్ సంస్థలకు ధీటుగా గుణాత్మక విద్య ఆశించడం సాధ్యమేనా అన్న విమర్శలు ఉన్నాయి. యూనివర్సిటీల్లోనూ ఇదే పరిస్థితి రావడం పట్ల పలువురు వైస్‌చాన్స్‌లర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెగ్యులర్ ప్రొఫెసర్లు లేకున్నా గెస్ట్ ఫ్యాకల్టీతో తరగతులు కొనసాగించవచ్చు. కానీ పరిశోధనలు సాధ్యం కావు. పాఠశాల నుంచి యూనివర్సిటీల దాకా అధ్యాపకుల కొరత ఉంది. అర్హత కలిగినవారు కూడా ఉన్నారు. నియామకాలు జరగకపోవడమే పెను సమస్యగా మారింది. 30 ఏళ్లుగా అధ్యాపకుల నియామకాలు జరగలేదు. గుల్బర్గా యూనివర్సిటీలో ఒకానొక కాలంలో 300 మంది రెగ్యులర్ ఆచార్యులు ఉండేవారు. ప్రస్తుతం 38 మంది మాత్రమే ఉన్నారు. దీన్నిబట్టి యూనివర్సిటీ ఏ విధంగా సాగుతోందనేది అర్థం చేసుకోవచ్చు. రూ.50వేలతో రెగ్యులర్‌గా ఉపాధ్యాయులను నియమించుకునే బదులు రూ.10వేలతో ఐదుగురు అతిథి ఉపాధ్యాయులను నియమించుకోవచ్చుననే విద్యాశాఖ భావించడమే ప్రస్తుత పరిస్థితికి కారణమవుతోంది. కళాశాలలో రెగ్యులర్ లెక్చరర్లకు మూలవేతనం రూ.50,800గా ఉంది. సీనియారిటీని బట్టి మొత్తంగా రూ.3లక్షల దాకా జీతం రానుంది. అతిథి లెక్చరర్లకు గరిష్ఠంగా రూ.35వేలు చెల్లిస్తున్నారు. పలు యూనివర్సిటీలలో ఇతర భాషలు, సంగీతం, లలితకళలు, చరిత్ర విభాగాలకు అధ్యాపకులే లేరు. రాష్ట్రంలో బీఈడీ పూర్తి చేసినవారు 12లక్షల మందిదాకా ఉన్నారు. అతిథి ఉపాధ్యాయులుగా కొనసాగేవారు 43,863 మంది ఉన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2,81,862 మంజూరైన పోస్టులు కాగా 2,28,803 మంది పనిచేస్తున్నారు. 53,059 పోస్టులు ఖాళీ ఉన్నాయి. అతిథి ఉపాధ్యాయులు కొన్నేళ్లుగా చేస్తున్న ప్రధాన డిమాండ్లలో సేవ లేదా ఉద్యోగ భద్రత కల్పించాలని, గెస్ట్ అనే పదానికి బదులుగా గౌరవ, లేదా ప్రభుత్వరంగ ఉపాధ్యాయులుగా గుర్తించాలని కోరుతున్నారు. కేవలం 9 నెలలకే వేతనాలు చెల్లిస్తున్నారని, వేసవి సెలవుల్లోనూ జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బ్యాంకుల ద్వారా జీతం జమ చేయాలని, ఏటా నియామకాలలో సర్వీస్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని, 5శాతం గ్రేడింగ్ ఇవ్వాలని, ఏటా సర్వీస్ సర్టిఫికెట్ ఇవ్వాలని, సెలవులతోపాటు రెగ్యులర్ ఉపాధ్యాయలు, అధ్యాపకులకు కల్పించే సదుపాయాలు వర్తింపచేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ప్రాథమిక ఉపాధ్యాయులకు రూ.10వేలు, హైస్కూల్ ఉపాధ్యాయులకు రూ.10,500, పీయూ కళాశాల లెక్చరర్లకు రూ.12వేలు, డిగ్రీ కళాశాల లెక్చరర్లకు రూ.35 వేలు, రెసిడెన్షియల్ స్కూల్ టీచర్లకు రూ.16,500, రెసిడెన్షియల్ స్కూళ్లలో కాంట్రాక్టు టీచర్లకు రూ.8,600 వేతనం చెల్లిస్తున్నారు. ఈ వేతన శ్రేణి పెంచాలని కోరుతున్నారు.



తీర్థహళ్లి తాలూకా ఆగుంబె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బోధిస్తున్న గెస్ట్ టీచర్



మీడియాతో మాట్లాడుతున్న సీఎం సిద్దరామయ్య

రాజకుటుంబం వర్సెస్ సీఎం

- చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార ఏర్పాటు
- కోర్టును ఆశ్రయించిన మైసూరు రాజమాత
- గడువు ముగియడంతో తొలి సమావేశానికి సీఎం హాజరు
- ఇది కోర్టు ఉల్లంఘనే : యువరాజు యదువీర్

బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార విషయంలో ప్రభుత్వం, మైసూరు రాజకుటుంబం మధ్య విభేదాలు తీవ్రమవుతున్నాయి. చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార ఏర్పాటు చేయరాదని రాజమాత ప్రమోదాదేవి ఒడయార్ కోర్టును ఆశ్రయించారు. ఆగస్టు 22తో కోర్టు గడువు ముగిసిన మేరకు మంగళవారం చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార తొలి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రత్యేకంగా హాజరయ్యారు. దేవదాయశాఖ మంత్రి రామలింగారెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి మహదేవప్ప ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. చాముండేశ్వరి కొండ అభివృద్ధి, పర్యవేక్షణ, భక్తులకు సౌలభ్యాలపై చర్చించారు. గతంలోనూ సమితి ఉండేదని సీఎం స్పష్టం చేశారు. ప్రాధికార ఏర్పాటు ద్వారా అభివృద్ధికి ఎక్కువ అవకాశాలు, అధికారం ఉంటాయన్నారు. భక్తులకు తగిన సౌలభ్యాలు, ఆరోగ్యకర వాతావరణం కల్పించడం తమ లక్ష్యమని తెలిపారు. చాముండిదేవి కొండ అభివృద్ధి విషయంలో పొరపాట్లు జరిగితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తప్పవన్నారు. ఆలయ సంప్రదాయం, చరిత్రను కాపాడడంతోపాటు అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రాధికార వ్యవస్థీకృతంగా కొనసాగాలంటే తరచూ సమావేశాలు జరగాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆదేశించారు. చాముండేశ్వరి ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందని, అందుకు అనుగుణంగా సౌలభ్యాలు పెరగాల్సిందే అన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు తగిన వాతావరణం ఉండాలన్నారు. మంత్రి వెంకటేశ్, ఎమ్మెల్యేలు జీటీ దేవెగౌడ, ఎమ్మెల్సీ యతీంద్ర సిద్దరామయ్య, రవిశంకర్, హరీశ్‌గౌడ, డాక్టర్ తిమ్మయ్య, వివేకానంద పాల్గొన్నారు. అనంతరం సీఎం మీడియాతో మాట్లాడుతూ కొప్పళ హుళిగమ్మ, ఘాటి సుబ్రమణ్య ఆలయాల అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రాధికారలు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఉందన్నారు. చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార ఏర్పాటుకు రాజమాత ప్రమోదాదేవి కోర్టును ఆశ్రయించారని, ఆగస్టు 22వరకు స్టే ఉండేదన్నారు. గడువు ముగిసిన మేరకే ప్రాధికార తొలి సమావేశం నిర్వహించామన్నారు. సెప్టెంబరు 5వరకు స్టే ఉందని ప్రమోదాదేవితోపాటు మైసూరు ఎంపీ యదువీర్ పాలకమండలి కార్యదర్శికి లేఖ రాశారు. ఇదే విషయమై మైసూరు యువరాజు, ఎంపీ యదువీర్ మీడియాతో మాట్లాడుతూ సీఎం నేతృత్వంలో చాముండేశ్వరి అభివృద్ధి ప్రాధికార సమావేశం నిర్వహించడం సరికాదన్నారు. కోర్టు స్టే ఉన్నా సమావేశం నిర్వహించడం న్యాయ ఉల్లంఘన అవుతుందన్నారు. సమావేశానికి తనతోపాటు తన తల్లి ప్రమోదాదేవికి ఆహ్వానం ఉన్నా పాల్గొనలేదన్నారు. ప్రాధికారపై తమ హక్కులను ఎప్పటికీ వదులుకునేది లేదన్నారు. చాముండేశ్వరి ఆలయ హుండీ ఆదాయాన్ని సదరు ఆలయాల అభివృద్ధికే కేటాయించాలని అన్నారు. హిందూ దేవాలయాలపై ఎందుకు ఇలా వ్యవహరిస్తున్నారని ప్రశ్నించారు. ప్రాధికార ఏర్పాటుతో తమ ఆచరణకు భంగం కలుగుతుందన్నారు. న్యాయపోరాటం కొనసాగిస్తామన్నారు.



మైసూరు ఎంపీ యదువీర్

కొవిడ్ నాటి అవినీతిపై రేపు కేబినెట్‌లో చర్చ : సీఎం

బెంగళూరు, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): కొవిడ్ క్లిష్ట సమయంలో సాగిన అవినీతిపై ప్రత్యేక కమిషన్ నివేదిక ఇచ్చిందని, గురువారం కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. మంగళవారం మైసూరులో ఆయన మీడియాతో మాట్లాడుతూ నివేదికను తాను పూర్తిగా చదవలేదని, అప్పుడే ప్రతిపక్షాలకు ఎలా చేరిందని ప్రశ్నించారు. నివేదిక చూడకుండానే వారు ఎలా మాట్లాడతారని అన్నారు. అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సుధాకర్‌కు ఎటువంటి తప్పులు చేశారనేది తెలుసు అన్నారు. అందుకే నివేదికకు ముందే విమర్శలు చేస్తున్నారని తెలిపారు. గుమ్మడికాయ దొంగ అంటే భుజాలు ఎందుకు తడుముకోవాలని ప్రశ్నించారు.

రెండో ఎయిర్‌పోర్ట్‌పై కసరత్తు

- ఆరుచోట్ల భూముల పరిశీలన
- అధికారులతో మంత్రుల సమీక్ష
- అనుమతుల కోసం వేగంగా కార్యాచరణ



బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరులోని కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఏటా ప్రయాణికుల సంఖ్య, సరుకు రవాణా గణనీయంగా పెరుగుతోంది. భవిష్యత్ అవసరాల కోసం రెండో విమానాశ్రయం నిర్మించాలని ప్రభుత్వ కసరత్తు చేస్తోంది. రెండో విమానాశ్రయం ఏర్పాటుపై భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ ప్రకటించిన తర్వాత రెండు నెలల వ్యవధిలోనే అనూహ్యమైన కార్యాచరణ సాగుతోంది. ఎయిర్‌పోర్ట్ నిర్మాణానికి జాతీయ రహదారి అనుబంధంతోపాటు వేలాది ఎకరాల భూమిని గుర్తిస్తున్నారు. ప్రస్తుతం ఆరు ప్రాంతాలకు సంబంధించి ఒక నివేదిక సిద్ధమైంది. వీటిలో ఒక ప్రాంతాన్ని ఎంపిక చేస్తారు. రామనగర జిల్లా మాగడి తాలూకాలో 8 గ్రామాలకు అనుబంధంగా ఉన్న 5వేల ఎకరాల భూమిని గుర్తించారు. నెలమంగల - మంగళూరు జాతీయ రహదారి 75కు ఇది 17 కిలో మీటర్ల దూరంలో ఉంది. మాగడి తాలూకాలోని ఇదే ఎన్‌హెచ్‌కు 30 కిలోమీటర్ల దూరంలో 5వేల ఎకరాల భూమిని 10 గ్రామాల పరిధిలో గుర్తించారు. నెలమంగల నుంచి 5 కిలో మీటర్ల దూరంలో 6వేల ఎకరాల భూమిని 13 గ్రామాలకు అనుబంధంగా ఎంపిక చేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లా దొడ్డబళ్లాపురలోనూ ఓ స్థలం గుర్తించారు. ఇది శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డుకు అనుబంధంగా 4వేల ఎకరాలతో ఉంది. దొడ్డబళ్లాపురకు 5కిలోమీటర్ల దూరంలో 4 గ్రామాలకు అనుబంధంగా ఉంది. బెంగళూరు గ్రామీణ జిల్లా తుమకూరు రోడ్డు దాబస్‌పేట వద్ద శాటిలైట్ టౌన్ రింగ్‌రోడ్డుకు అనుబంధంగా 5,500 ఎకరాల భూమిని గుర్తించారు. ఇది దాబస్ పేట నుంచి 11 కిలోమీటర్ల దూరంలో 15 గ్రామాలకు అనుబంధంగా ఉంది. చివరగా రామనగర జిల్లా హారోహళ్లి వద్ద బెంగళూరు - కనకపుర రోడ్డుకు అనుబంధంగా 5వేల ఎకరాల భూమి ఉంది. మైసూరు రోడ్డుకు 17 కిలోమీటర్ల దూరంలోనూ, నైస్ రోడ్డుకు 35 కిలోమీటర్ల దూరంలోనూ ఉంది. 12 గ్రామాలు అనుబంధంగా ఉన్నాయి. కర్ణాటక పారిశ్రామిక అభివృద్ధి మండలి సదరు స్థలాలను గుర్తించింది. రాష్ట్రంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్పొరేషన్, బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ ప్రస్తావించిన ప్రదేశాలను పరిశీలించేందుకు ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, భారీ పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ నేతృత్వంలో ఇటీవల సమావేశం నిర్వహించారు. విమానాశ్రయం కోసం గుర్తించిన స్థలాలతో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ)కు నివేదికలు సమర్పించినట్లు మంత్రి ఎంబీ పాటిల్ ప్రకటించారు. అథారిటీ అధికారులు పరిశీలించి తుది నిర్ణయం ప్రకటిస్తారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రి ఎంబీ పాటిల్ ఒకటి రెండు రోజుల్లోనే రెండో విమానాశ్రయానికి సంబంధించి సీఎం సిద్దరామయ్యతో చర్చలు జరిపే అవకాశం ఉంది. కెంపేగౌడ విమానాశ్రయం 25ఏళ్ల ఒప్పందం ప్రకారం 2033-34 నాటికి గడువు ముగుస్తుంది. అంతవరకు బెంగళూరుకు రెండో విమానాశ్రయం వచ్చే అవకాశం లేదు. రెండో విమానాశ్రయం ఎంపిక రాజకీయ పరిణామాలకు అనుగుణంగా జరగదు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా, బెంగళూరుతోపాటు కర్ణాటక సమగ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని 15 నిబంధనలు, మార్గదర్శకాలకు అనుగుణంగా ఎంపిక చేస్తారు. బెంగళూరులో భవిష్యత్తులో 54 కొత్త పరిశ్రమలతోపాటు 89 కొత్త ఐటీ టెక్ పార్కులను నిర్మించదలిచారు. ఈ ప్రగతికి అనుగుణంగా సాంకేతిక కేంద్రంగా నగరాన్ని తీర్చిదిద్దనున్నారు. కొత్త టెక్ పార్క్‌లో బెంగళూరు ఉత్తర, మహాదేవపుర, బొమ్మనహళ్లి క్లస్టర్‌తోపాటు ఇతర ప్రాంతాలకు విస్తరింపచేయదలిచారు. ఉత్తర సర్కిల్లోని యశ్వంతపురలో 10 ఐటీ కంపెనీలు, వైట్‌ఫీల్డ్‌లో 10, బెళ్లందూరులో 5, తుమకూరులో 2, కోరమంగలలో 1, కుందలహళ్లిలో 3 ఐటీ కంపెనీలు రానున్నాయి. బెంగళూరులో రెండో ఎయిర్‌పోర్ట్ ప్రస్తావన రాగానే నగరానికి 40 కిలోమీటర్ల దూరంలోని తమిళనాడు రాష్ట్రం హోసూరులో అంతర్జాతీయ విమానాశ్రయం ఏర్పాటుకు ఆ రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. విమానాశ్రయానికి కనీసం 150 కిలోమీటర్ల దూరం ఉండాలనే నిబంధన ఉంది. బెంగళూరు దేవనహళ్లి ఎయిర్‌పోర్ట్‌కు హోసూరులో ప్రతిపాదిస్తున్న ఎయిర్‌పోర్ట్‌కు 60-70 కిలోమీటర్ల దూరం కూడా ఉండదు. రాష్ట్రంలో బెంగళూరు, మంగళూరులో అంతర్జాతీయ విమానాశ్రయాలతోపాటు బెళగావి, హుబ్బళ్లి, బీదర్, శివమొగ్గ, మైసూరులో విమానాశ్రయాలు ఉన్నాయి.



ఇటీవల అధికారులతో సమీక్షించిన భారీ పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్

స్మారకంగా నిజలింగప్ప ఇల్లు

- కొనుగోలుకు నిర్ణయించిన కేపీసీసీ
- పరిశీలించిన మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎస్.నిజలింగప్పకు చెందిన నివాసాన్ని కొనుగోలు చేసేందుకు కాంగ్రెస్ రాష్ట్ర పార్టీ నిర్ణయించింది. ఇటీవలే చిత్రదుర్గ నగరం వీసీ లే అవుట్‌లో శిథిలావస్థ దశలో ఉన్న నివాసాన్ని మంత్రి లక్ష్మీ హెబ్బాళ్కర్, కేపీసీసీ ఉపాధ్యక్షుడు మురళీధర్ హాలప్ప సందర్శించారు. రాష్ట్ర పార్టీ సూచన మేరకు నిజలింగప్ప నివాసాన్ని పరిశీలించామని మంగళవారం బెంగళూరులో తెలిపారు. నిజలింగప్ప జీవనం సాగించిన ఇంటిని స్మారకంగా అభివృద్ధి చేయాలని పార్టీ నిర్ణయించిందన్నారు. పార్టీ కోసం నిజలింగప్ప ఎంతో సేవ చేశారని తెలిపారు. ఆయన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడిగా వ్యవహరించారని అన్నారు. 2022లో అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై ఇంటిని అభివృద్ధి చేసేందుకు రూ.5కోట్లు విడుదల చేశారు. ఈ గ్రాంటులో రూ. 4.24 కోట్లు ఇంటి కొనుగోలుకు, రూ. 76 లక్షలు స్మారకం అభివృద్ధికి ఖర్చు చేయాలని నిర్ణయించారు. సదరు నిధులు ప్రజా పనులశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఖాతాలో ఉన్నాయి. కొన్ని సాంకేతిక కారణాలతో కొనుగోలు వాయిదాపడింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా కాంగ్రెస్ పార్టీనే ఆ ఇంటిని కొనుగోలు చేయాలని నిర్ణయించింది. నిజలింగప్ప తర్వాత ఏఐసీసీ అధ్యక్షుడిగా కర్ణాటక నుంచి ప్రస్తుతం మల్లికార్జున ఖర్గే వ్యవహరిస్తున్నారు.



చిత్రదుర్గలోని నిజలింగప్ప నివాసం

అన్నదాతకు కోలుకోలేని దెబ్బ

- భారీ వర్షాలకు దెబ్బతిన్న పంటలు
- తడిసిన రాసులు.. మగ్గిన గింజలు
- మిరప, ఉల్లి, జొన్నకు భారీ నష్టం



తోరణగల్లులో అతివృష్టి కారణంగా దెబ్బతిన్న జొన్న పంటను చూపుతున్న రైతు


బళ్లారి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): గోరుచుట్టుపై రోకలి పోటు అన్నట్లు రైతులకు దెబ్బమీద దెబ్బలు తగులుతూ తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. వారంరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సాగులో ఉన్న అనేక పంటలు దెబ్బతిని రైతులు కోలుకోలేక పోతున్నారు. ఖరీఫ్‌లో రైతులు జొన్న, మిరప, సజ్జ, మొక్కజొన్న, మిరప పంటలు సాగుచేశారు. ఇవి కొంత కోతదశలో ఉంటే మరికొన్ని చోట్ల రైతులు పంటలు వడుపుకుని కల్లాల్లో వేసుకున్నారు. వారం రోజుల నుంచి తెరపి లేకుండా వానలు కురుస్తుండడంతో చేతికొచ్చిన పంట ఇంటికి రాకుండా పోయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. బళ్లారి, విజయనగర, రాయచూరు, కొప్పళ, చిత్రదుర్గ, కలబురగి తదితర జిల్లాల్లో జూన్, జులై నెలల్లో బోర్లు, ఇతర నీటి సౌకర్యాలు ఆధారంగా పంటలు సాగు చేశారు. ఇలాంటి తరుణంలో భారీ వర్షాలు రైతులను నిండా ముంచాయి. పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విజయనగర జిల్లాలోని హగరిబొమ్మనహళ్లి, హువ్వినహడగలి, కూడ్లిగి, బళ్లారి జిల్లాలోని సిరుగుప్ప, సండూరు, కంప్లి, కొప్పళ జిల్లాలోని కుష్టిగి, గంగావతి, రాయచూరు జిల్లాలోని సింధనూరు, చిత్రదుర్గ జిల్లాలోని చెళ్లకెర, తదితర తాలూకాల్లో రైతులు ఎక్కువగా పంట నష్టపోయారు. ఈ నాలుగు జిల్లాల్లో సుమారు 30వేల ఎకరాల్లో జొన్న, 10 వేల ఎకరాల్లో సజ్జ, 15 వేల ఎకరాల్లో వేరుశనగ, 10 వేల ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంటలు, తుంగభద్ర జలాశయం కింద 15వేల ఎకరాల్లో మిరప, 15 వేల ఎకరాల్లో పత్తి పంట దెబ్బతిన్నాయని రెవెన్యూ, వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాలు వేశాయి.



హడగలి వద్ద తడిసిన రాసులను ఆరవేసుకుంటున్న రైతులు



తడిసిన మిరప పంట



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1631.38	1,624.39
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	29,907	542
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	15,264	10,158
సామర్థ్యం (టీఎంసీలు)	99.35	74.52

పుస్తక పఠనంతోనే జీవితం సుసంపన్నం



పుస్తకాలను చదవడం నేర్పుతున్న రవిచెళ్లగుర్కి

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 3: సంపన్న జీవనశైలి కంటే పుస్తక పఠనం సుసంపన్నమైనదని కర్ణాటక రాష్ట్ర యాక్టివ్ టీచర్స్ ఫోరం బళ్లారి జిల్లా విభాగం అధ్యక్షుడు రవిచెళ్లగుర్కి అన్నారు. తాలూకాలోని సంజీవరాయనకోట ప్రభుత్వ సీనియర్ ప్రాథమిక పాఠశాలలో పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించేందుకు మంగళవారం జరిగిన పఠన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి పిల్లలందరికీ పాఠశాల లైబ్రరీ పుస్తకాలను పంపిణీ చేశారు. పిల్లల్లో చదివే అలవాటును పెంపొందించడమే దీని ప్రధాన లక్ష్యమన్నారు. చదివే అలవాటున్న పిల్లల్లో విజ్ఞానం పెంపొం దుతుందన్నారు. అందువల్ల పిల్లలు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్ వంటి మహానుభావుల పుస్తకాలను చదివే అలవాటును అలవర్చుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్ర జయంతి



వీరభద్ర జయంతి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

బళ్లారిసిటీ, సెప్టెంబరు 3: నగరంలోని హరగిణ డోని, కమ్మరచేడు కల్యాణస్వామి మఠం సన్నిధిలో మంగళవారం వీరభద్రేశ్వర స్వామి జయంతి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. అనంతరం కనకదుర్గమ్మ దేవాలయం నుంచి 201 మంది ముత్తైదువులు కలశాలతో వెంటరాగా శ్రీ వీరభద్రేశ్వర స్వామి చిత్రపటాన్ని ఊరేగించారు. గంగాజలంతో, వీరగాసె. నందికోలు తదితర జానపద వాయిద్యాలతో కనకదుర్గమ్మ దేవాలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు నగరంలోని ఎస్పీసర్కిల్, బసవ భవన్ మీదుగా వీరభద్రేశ్వరుని దేవాలయానికి చేరుకుంది. ఈ ఊరేగింపులో వాలంటీర్లు పచ్చచీరలు ధరించి పాల్గొనడం అందరినీ ఆకట్టుకుంది. బసవరాజ స్వామి, ఇతర భక్తుల ఆధ్వర్యంలో మహామంగళహారతి, ప్రసాద పంపిణీ జరిగింది.

మైనారిటీలకు ప్రత్యేక పథకాల సమాచారం



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 3: అర్హులైన మైనారిటీలకు వివిధ శాఖలు అందిస్తున్న ప్రత్యేక ప్రాజెక్టుల సమాచారాన్ని అందజేసేందుకు మైనారిటీ సంక్షేమశాఖ అధికారులు గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ కుమార్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లాకలెక్టర్ కార్యాలయంలోని వీడియో హాల్లో మంగళవారం ఏర్పాటు చేసిన 15అంశాల ప్రధానమంత్రి నూతన కార్యక్రమాల ప్రగతి సమీక్షా సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పథకాలను అందజేసే వివిధ శాఖల అధికారులు అర్హులైన లబ్ధిదారులను గుర్తించాలన్నారు. లబ్ధిదారుల అధారిత, కమ్యూనిటీ అధారిత పథకాల వివరాలను నమోదు చేయాలన్నారు. కొత్త లబ్ధిదారులకు అవకాశం కల్పించాలన్నారు. ప్రధానమంత్రి నూతన 15అంశాల కార్యక్రమం కిందకు వచ్చే మైనారిటీ వర్గాల ప్రాంతాల్లో వివిధ శాఖలు, స్థానిక సంస్థల సహకారంతో సమాచార సమావేశం నిర్వహించాలన్నారు. 2024-25 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యానికి సంబంధించిన అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని తగిన విధంగా అమలు చేయాలని జిల్లాకలెక్టర్ సూచించారు. ఈసందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

- తెలుగు పాఠశాలలపై ప్రభుత్వం శీతకన్ను
- మూతపడిన తెలుగు బడులు
- భర్తీకాని వేలాది ఉపాధ్యాయ పోస్టులు
- అమ్మభాషపై పిల్లల్లో తగ్గుతున్న ప్రేమ

అమ్మ భాషకు ఆదరణ కరువు



మూతబడిన తెలుగు మాధ్యమ పాఠశాల



బళ్లారి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): 'దేశభాషలందు తెలుగులెస్స' అన్న శ్రీకృష్ణ దేవరాయలు ఏలిన ప్రాంతం బళ్లారి. మద్రాస్ ప్రెసిడెన్సీ కేంద్రంగా పాలన జరుగుతున్న రోజుల్లో బళ్లారి అంటేనే తెలుగోడి గడ్డ. గతంలో తెలుగు మాధ్యమ పాఠశాలలు కోకొల్లలు. కానీ ఇప్పుడు తెలుగుదనానికి కష్టం వచ్చింది. తెలుగుమాధ్యమ పాఠశాలలు మూత పడిపోయాయి. దీనిపై పలువురు తెలుగువారు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

1956-57 వరకూ బళ్లారి జిల్లా ఆంధ్రలో ఉండేది. అప్పుడు ఎక్కువగా తెలుగుభాషలోనే వ్యవహారాలు జరిగేవి. దస్త్రాలు, ఇతరత్రా కార్యాలయ ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా తెలుగులోనే జరిగేవి. ఇక్కడ బళ్లారి రాఘవ, ధర్మవరం రామకృష్ణాచార్యులు లాంటి ఎంతో మంది మహానుభావులు, కవులు, రచయితలు వెలుగొందారు. తెలుగుభాషకు ఇక్కడ పెద్ద పీట వేశారు. ఇక్కడ తెలుగుమాట్లాడేవారి కారణంగా ఇక్కడ తెలుగు మాధ్యమ పాఠశాలలే ఎక్కువగా ఉండేవి. ఉదాహరణకు ఒక పాఠశాలలో 7 నుండి 8 పీరియడ్లు ఉంటే ఏకంగా అందులో సుమారు 6 పీరియడ్లు తెలుగు మాధ్యమంలో నడిచేవి. పైగా ఇక్కడ తుంగభద్ర డ్యాం ఉండడం అలాగే వివిధ కేంద్ర ప్రభుత్వ శాఖలు, ఇతర ఉద్యోగులు ఇక్కడ పనిచేసేందుకు వచ్చినప్పుడు వారి పిల్లలు చదువుకునేందుకు తెలుగు మాధ్యమ పాఠశాలలను ఇక్కడ ఏర్పాటు చేశారు.

బళ్లారి, రాయచూరు, విజయనగర, కొప్పళ, చిత్రదుర్గం జిల్లాల్లో ఎక్కువగా తెలుగు భాషను మాట్లాడేవారు. అప్పట్లో సుమారు 25 హైస్కూళ్లలోనూ, 30 కి పైగా ప్రాథమిక పాఠశాలల్లో, 8 కళాశాలల్లో తెలుగుమాధ్యమం ఉండేది.

1956లో ఏర్పడిన భాషాప్రయుక్త రాష్ట్రాల కారణంగా బళ్లారి ఆంధ్ర నుండి వేరు పడి కర్ణాటకలో చేరింది. దీంతో ప్రభుత్వం తెలుగు అభివృద్ధికి సహకరించడం మానేసింది. ఇప్పటి వరకూ తెలుగుమాధ్యమ పాఠశాలలు, కళాశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయ, అధ్యాపకులు రిటైరయిపోగా, వారి స్థానంలో ఇంత వరకూ కొత్త వారిని నియమించలేదు. పైగా తెలుగు మాధ్యమ విద్యార్థులకు తెలుగు పుస్తకాలు ఇవ్వడంలేదు. ఈ నేపథ్యంలో తెలుగు మాధ్యమంలో చదివితే కర్ణాటకలో ఉద్యోగాలు రావనే భయం విద్యార్థుల్లో నెలకొనడంతో తెలుగు గడ్డ అయిన బళ్లారిలో తెలుగు మాధ్యమ పాఠశాలలు దాదాపుగా మూత పడిపోయాయి. ఇప్పుడు వీటిలో సగానికి సగం కూడా తెలుగు మాధ్యమ పాఠశాలలు లేకుండా పోయాయి. తిరిగి వీటిని పునరుద్ధరించాలని పలువురు తెలుగు ప్రముఖులు కోరుతున్నారు.

తెలుగు విద్యార్థులను ప్రోత్సహించాలి

మాధవీలత, తెలుగుపండిట్ , కేఎస్‌పీ గర్ల్స్ కళాశాల



తెలుగు భాషను నేర్చుకునేందుకు విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి. అమ్మ భాషలో ఉండే గొప్పదనం మరే భాషలోనూ ఉండదు. అది అనుభవించేవారికే తెలుస్తుంది. అందుకే తల్లిండ్రులు, ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు తెలుగుభాషను కాపాడుకునేందుకు ముందుకురావాలి.

2 శాతం రిజర్వేషన్‌ను పునరుద్ధరించాలి

డాక్టర్ ఆర్. దేవన్న, రిటైర్డ్ తెలుగు ప్రొఫెసర్



తెలుగు మాధ్యమంలో చదివితే ప్రభుత్వం ఇంతకు ముందు రెండు శాతం రిజర్వేషన్ ఇచ్చేది. దానిని తిరిగి ప్రవేశపెట్టాలి. అమ్మభాష అయిన తెలుగు మాధ్యమంలో చదివేందుకు తల్లిదండ్రులు ప్రోత్సహించాలి, అలాగే కర్ణాటక ప్రభుత్వం కూడా పాఠశాలలో ఏర్పడిన ఉపాధ్యాయ, అధ్యాపక ఖాళీలను భర్తీ చేయాలి.

భవిష్యత్ గురించి పిల్లల్లో భయం

జీ.ఆర్. వెంకటేశులు, రిటైర్డు ప్రిన్సిపాల్



నేను చదువుకునే రోజుల్లో ఇక్కడ తెలుగుమాధ్యమపాఠశాలలే ఎక్కువ. ఇక్కడ ఉండే ప్రతి పిల్లవాడు తెలుగు మాధ్యమంలోనే చదువుకునేవాడు. తల్లిదండ్రులు కూడా తెలుగుమాధ్యమాన్ని ప్రోత్సహించేవారు. కానీ ఇప్పుడు తెలుగు వెలుగు తగ్గిపోయింది. పిల్లలు కూడా తెలుగు మాధ్యమంలో చదువుకుంటే తమ భవిష్యత్తు ఏమిటని ఆలోచిస్తున్నారు.

డ్యాం కింద ఉండే గ్రామాలకు హై అలర్ట్

- వంద టీఎంసీలు దాటిన నీటి నిల్వ
- అప్రమత్తంగా ఉండాలంటున్న బోర్డు అధికారులు



టీబీ డ్యాం (ఫైల్)

కంప్లి, సెప్టెంబరు 3: తుంగభద్ర నది పరివాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజయనగర, కొప్పళ జిల్లా కలెక్టర్లు ప్రకటించారు. టీబీ డ్యాం నుండి నదికి బుధవారం నీరు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. డ్యాం పై ప్రాంతంలో ఉండే తుంగ, భద్ర జలాశయాలు నుండి తుంగభద్ర డ్యాంకు వరద నీరు ఉధృతంగా చేరుతున్నాయని బోర్డు అధికారులు తెలిపారు. తుంగ, భద్ర నుండి 50వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉందని అధికారులు తెలిపారు. డ్యాంలో మంగళవారం రాత్రికి నీటి నిల్వలు వంద టీఎంసీలు దాటాయి. డ్యాంకు వరద నీరు పోటెత్తుండడంతో నదిసమీపంలో ఉండే గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. కంప్లి, గంగావతి, సిరుగుప్ప, హంపీ, తదితర నదీసమీప గ్రామాల ప్రజలు ఎవరూ నది వైపు వె ళ్లరాదని ప్రకటించారు. మత్స్యకారులు, నది లో అటు నుండి ఇటు దా టరాదని హెచ్చరించారు. డ్యాంలో మంగళవారం ఉదయం అధికారులు నీటి లెక్కలు వేసే సమయానికి 99.351 టీఎంసీలు నీరు ఉండగా, సాయంత్రం అది 100.521 టీఎంసీలకు చేరింది.

నేత్రదానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపండి

- విమ్స్ డైరెక్టర్ గంగాధర్‌గౌడ్

బళ్లారి సిటీ, సెప్టెంబర్ 3: దృష్టిలోపం ఉన్న వారి జీవితాల్లో వెలుగులు నింపి నేత్రదాన పుణ్యకార్యంలో అందరూ భాగస్వాములు కావాలని విమ్స్‌డైరెక్టర్ గంగాధర గౌడ సూచించారు. వైద్య భవన్‌లో 39వ జాతీయ నేత్రదానం సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మరణానంతరం కళ్లను కంటి చూపు లోపించిన వారికి దానం చేసే అద్భుత ప్రక్రియలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలన్నారు. ప్రమాదవశాత్తూ నేత్రాలను కోల్పోయిన వారికి నేత్రదానం చేయడం ద్వారా అంధత్వం నుంచి విముక్తి పొందే అవకాశం ఉందన్నారు. వ్యక్తి చనిపోతే కుటుంబ సభ్యులు బిఎంఎస్ నంబర్ 9483414824 కు ఫోన్ చేస్తే వైద్య బృందం సురక్షితంగా కళ్లను సేకరిస్తుందని, ఈ పనులన్నీ వ్యక్తి మరణించిన 6-8గంటలలోపు పూర్తి చేయాలని చెప్పారు. గత జనవరి నుంచి ఇప్పటి వరకు 50 మంది నేత్రదానం చేశారు. ఈసందర్భంగా జిల్లా అంధత్వ నియంత్రణ అధికారి డాక్టర్ వీరేంద్రకుమార్, నేత్రవైద్య నిపుణుడు మదన్‌జోషి, డాక్టర్.చిదాంబర్, నేత్ర వైద్య విభాగాధిపతి డాక్టర్ యోగేశ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విమ్స్ డైరెక్టర్ గంగాధరగౌడ

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం



ఖోఖో ఆడుతూ హైస్కూలు క్రీడలను ప్రారంభిస్తున్న ప్రముఖులు

కంప్లి, సెప్టెంబరు 3 : ప్రతి ఒక్క విద్యార్థి క్రీడల్లో పాల్గొని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని దేవలాపురం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఈరమ్మ, రమేష్ తెలిపారు. శ్యామియాచంద్ పాఠశాల ఆవరణలో మంగళవారం జరిగిన క్రీడా పోటీల్లో ఆమె పాల్గొని ప్రసంగించారు. ఇందులో 27 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఖోఖో, కబడ్డీ, త్రోబాల్, వాలీబాల్, షార్ట్‌పుట్, హైజంప్ తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం శివరాజు, పట్టణ ప్రముఖులు బసవన్నగౌడ, ముఖ్య అధికారి దుర్గన్న, ఏసీ దానప్ప, సిండికేట్ సభ్యులు శివకుమార్ తదితరులు కబడ్డీ పోటీలను ప్రారంభించారు. వారు విద్యార్థులతో కబడ్డీ పోటీల్లో కూడా పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు వహించాలి

కంప్లి: గ్రామాలలోని ప్రజలు, రైతులు విద్యుత్ ప్రమాదం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే జేఎన్ గణేష్ తెలిపారు. మంగళవారం కురుగోడు పట్టణంలో దొడ్డబసవేశ్వరాలయం వద్ద విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని తప్పెట్లు కొడుతూ ప్రారంభించారు. ప్రమాదసమయంలో కురుగోడు జెస్కమ్ కార్యాలయంలో 1912, 9769368959 నెంబర్లకు ఫోన్‌రూపంలో గానీ, వీడియో రూపంలో గానీ సమస్యలు తెలియజేస్తే సిబ్బంది సమస్యను పరిష్కరిస్తారని తెలిపారు.

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

సిరుగుప్ప, సెప్టెంబరు 3 : గణేష్ ఉత్సవాల్లో డీజే సౌండ్‌కు అనుమతిలేదని ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని ఎస్పీ శోభారాణి తెలిపారు. మంగళవారం సిరుగుప్ప పట్టణంలో శ్రీ వెంకటేశ్వర కళ్యాణమండపంలో ఈ నెల 7వ తేదీన జరుగనున్న గణేశ విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా శాంతిసభ నిర్వహించారు. ఈ శాంతిసభలో ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మట్టి గణపతులను స్థాపించాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా పోలీసుశాఖ చూపించిన మార్గంలో వెళ్లాలని తెలిపారు. తుంగభద్ర నదిలో ఈత కొట్టేవారిని మాత్రమే వదులుతామని తెలిపారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేష్, సీఐ హనుమంతప్ప, టెక్కలకోట సీఐ సుందరేష, అచ్చొళ్లి ఎస్ఐ కుమారస్వామి, ఎస్ఐ శ్రీనివాస, నగరసభ కమీషనర్ పాల్గొన్నారు.

బళ్లారి జైల్లో అదనంగా సీసీ కెమెరాల ఏర్పాటు



జైల్లో అదనంగా సీసీ కెమెరాలు అమర్చుతున్న దృశ్యం

బళ్లారి, సెప్టెంబరు 3(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా జైల్లో నిఘానేత్రాలు పెరిగాయి. ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలకు అదనంగా మరిన్ని సీసీ కెమెరాలు అమర్చారు. మునుపు 50 పైగా ఉంటే అదనంగా మరో 12 సిసి కెమెరాలు మంగళవారం అమర్చారు. ప్రస్తుతం జ్యూడీషియల్ కస్టడీలో జైల్లో ఉన్న దర్శన్ తనుండే గదిలో టీవీ ఏర్పాటు చేయాలని కోరారని తెలిసింది. మంగళవారం సాయంత్రం భోజన సమయంలో జైలర్‌ను కలిసిన ఆయన తాను మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఉండేందుకు టీవీ ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిసింది.

నీలమ్మ దేవికి ప్రత్యేక పూజలు

కంప్లి, సెప్టెంబరు 3 : కురుగోడు పట్టణం కొండల్లో వెలసిన నీలమ్మదేవి కి మంగళవారం సందర్భంగా కంప్లి నియోజకవర్గ ఎమ్మెల్యే జేఎన్ గణేష్ దంపతులు ప్రత్యేక పూజలు చేపట్టారు. లోకకల్యాణార్థం కోసం పూజలు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అలాగే బుక్కసాగర వద్ద ఏళు పడగల నాగప్ప ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు జరిగాయి. పురోహితులు విశ్వనాథస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



నీలమ్మదేవి సేవలో కంప్లి ఎమ్మెల్యే దంపతులు

వైభవంగా వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం



దరూరులో రథంపై ఊరేగుతున్న స్వామి

కంప్లి: శిరిగేరి సమీపంలోని దరూరు వీరభద్రేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. ప్రతి ఇంట ఆడవారికి ఒడినింపే కార్యక్రమం చేపట్టారు. రథోత్సవానికి సిరుగుప్ప, బళ్లారి, కొప్పాళ, సింధనూరు, హోస్పేట, చిత్రదుర్గ, ఆంధ్రలోని ఆలూరు, ఆదోని, తదితర పట్టణాలనుంచి భక్తులు భారీఎత్తున తరలివచ్చారు.

ఘనంగా పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలు

సిరుగుప్ప, సెప్టెంబరు 3 : ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని పవన్‌కళ్యాణ్ అభిమానసంఘం అధ్యక్షులు మూర్తి ఆధ్వర్యంలో దివ్యజ్యోతి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సిరుగుప్పశంభులింగేశ్వర ఆలయంలో పూజలు జరిపి అనంతరం అన్నదానం చేశారు.



అన్నదానం చేస్తున్న దృశ్యం

ఎన్టీఆర్ క్యాంటీన్లో అన్నదానం

బళ్లారి రూరల్, సెప్టెంబరు 3: నగరంలో మంగళవారం బెళగల్లు క్రాస్‌లో ఉన్న ట్రామా కేర్ సెంటర్ హాస్పిటల్ ఆవరణంలోని ఎన్టీఆర్ అన్న కేంద్రంలో సందీప్ జన్మదినం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. సందీప్ మాట్లాడుతూ అన్నం పరబ్రహ్మ స్వరూపం అని పేద,బడుగు బలహీన వర్గాలకు అన్నదానం చేస్తే పుణ్యం లభిస్తుందన్నారు.

హోసూరు జోన్

ముగుళపల్లిలో వర్మీ కంపోస్ట్ తయారీ శిక్షణ



శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న వ్యవసాయ సహాయ సంచాలకులు

హోసూరు, సెప్టెంబరు 3: హోసూరు సమీపంలోని వ్యవసాయ శాఖ రాష్ట్ర విస్తరణ కార్యక్రమాల్లో భాగంగా గ్రామాల్లో వ్యవసాయ సహాయ సంచాలకుల నేతృత్వంలో వర్మీ కంపోస్టింగ్‌పై(వానపాములతో సేంద్రీయ ఎరువు తయారీ)పై ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ శిక్షణల్లో వ్యవసాయ సహాయ సంచాలకులు భువనేశ్వరీ భూసార నిర్వహణ ప్రాముఖ్యత, రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధి పథకం, ముఖ్యమంత్రి భూసార జీవవైవిధ్య పరిరక్షణ పథకం ప్రయోజనాల గురించి వివరించారు. అదియమాన్ కళాశాల రీసెర్చ్ సెంటర్, అత్తిముగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జ్ఞానకీర్తి సహాన పాల్గొని రైతులకు వర్మీ కంపోస్ట్ సాంకేతిక పద్ధతులు, దాని ఉపయోగం సుసంపన్నమైన కంపోస్ట్ ఉత్పత్తి , ప్రయోజనాల గురించి స్పష్టమైన వివరణ ఇచ్చారు. హోసూరు ఉప- వ్యవసాయ అధికారి మురుగేశన్ విత్తన శుద్ధి ప్రయోజనాలు, సూక్ష్మపోషకాల ప్రయోజనాలు ఎరువులు, జీవామృతం వేసే పద్ధతులను రైతులకు వివరించారు. హోసూరు సహాయ వ్యవసాయ అధికారి చిన్నస్వామి మాట్లాడుతూ టిల్లర్ దరఖాస్తు నమోదు ప్రాముఖ్యత , ప్రయోజనాలు, సేంద్రియ వ్యవసాయం ప్రాముఖ్యత , రాగి , వడ్లు సాగు సాంకేతికతలు వ్యవసాయ రంగంలో సబ్సిడీ పథకాల గురించిన వివరాలను రైతులకు తెలిపారు.

అడవి పందులతో పంటలు నాశనం



నష్టపోయిన పంటను చూపుతున్న రైతులు

హోసూరు, సెప్టెంబరు 3: హోసూరు ప్రాంతంలో రైతులు సాగు చేసిన వేరుశనగను అడవిపందులు తవ్వి వేయడంతో మొక్కలు దెబ్బతిని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హోసూరు దాని చుట్టుప్రక్కల ఉన్న బాగలూరు, బేరికై, శూలగిరి, అంచెట్టి, తళి సహ పలు ప్రాంతాల్లో వేలాది ఎకరాల్లో ఈ పంట సాగు చేస్తున్నారు, హోసూరులోని నంజనాటి ప్రాంతంలో అడవి నుంచి అడవి పందులు పెద్ద ఎత్తున సాగు చేసిన పొలాల్లోకి ప్రవేశించి నేలను తవ్వి ధ్వంసం చేయడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అడవి పందుల నుంచి తమను కాపాడాలని వారు కోరుతున్నారు.

యూపీఎస్‌సీకి ఉచిత శిక్షణ

హోసూరు(కృష్ణగిరి) సెప్టెంబరు 3: తమిళనాడు ఆది ద్రావిడర్ హౌసింగ్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, డాక్టర్ అంబేడ్కర్ అకాడమీ, చెన్నైలోని ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌తో కలిసి 100 మంది ఆది ద్రావిడ గిరిజన విద్యార్థులకు యూపీఎస్‌సీ పరీక్ష కోసం ఒక సంవత్సరం ప్రాథమిక శిక్షణను అందజేస్తుందని జిల్లా కలెక్టర్ కె.ఎం.సరయు తెలిపారు. కేంద్రప్రభుత్వం స్టాఫ్ సెలక్షన్ కమీషన్ నిర్వహించే పరీక్ష రాసేందుకు అర్హులైన విద్యార్థులను ఫెయిర్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారని ఈ పథకం కోసం నమోదు చేసుకోవడానికి, తాట్కో వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చునని ఆమె పేర్కొన్నారు. మొదటగా అర్హత సాధించిన 100 మంది విద్యార్థులకు శిక్షణ ఇస్తారని, డిగ్రీ ఉత్తీర్ణులైన 21 నుంచి 36 సంవత్సరాల మధ్య గల ఆది ద్రావిడ , గిరిజనులు ఈ శిక్షణ కోసం దరఖాస్తు చేయవచ్చునన్నారు.

ఎయిమ్స్ ఏర్పాటుకు నిబద్ధతతో కృషి

- పోరాట సమితి నాయకులతో కేంద్ర మంత్రి సోమణ్ణ

రాయచూరు సెప్టెంబర్ 3 : జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వం వద్ద తనవంతు ప్రయత్నం చేస్తానని కేంద్ర మంత్రి వీ సోమణ్ణ హామి ఇచ్చారు. రాయచూరు జిల్లాలో ఎయిమ్స్ ఏర్పాటు కోరుతూ పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె మంగళవారం 845వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా దీక్షా శిబిరాన్ని సందర్శించిన కేంద్ర మంత్రి ఈ ప్రాంత ప్రజలు ఎయిమ్స్ కోసం చేస్తున్న పోరాటం పూర్తిగా న్యాయసమ్మతమైందన్నారు. గతంలో ట్రిబుల్ ఐటీ మంజూరు కాగా రాష్ట్రంలోని ఇతర జిల్లాలకు తరలిపోయిన నేపథ్యంలో ఎయిమ్స్ ఏర్పాటును రాష్ట్ర ప్రభుత్వం అనివార్యంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇటీవలే ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వం తరపున కేంద్రానికి లేఖ రాశారని తాము కూడా ఈ విషయంలో కేంద్రప్రభుత్వం దృష్టికి తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఇక్కడ జరుగుతున్న ఎయిమ్స్ ఏర్పాటు కోసం సుదీర్ఘకాలంగా రాయచూరులో సాగుతున్న పోరాటం గురించి తనతో పాటు కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఉందని మంత్రి వెల్లడించారు.



మంత్రి సోమణ్ణకు వినతి పత్రం అందజేస్తున్న బసవరాజ కళస

అదుపుతప్పి పడిపోయిన ఆర్టీసీ బస్సు



ఒరిగిపోయిన ఆర్టీసీ బస్సు

రాయచూరు సెప్టెంబరు 3: ఇండి నుంచి రాయచూరు మీదుగా మంత్రాలయం వెళుతున్న ఆర్టీసీ బస్సు ఒకటి మంగళవారం ప్రమాదానికి గురైంది. బస్సు మంత్రాలయంవైపు వెళుతుండగా స్థానిక సేంట్ మేరిస్ కాన్వెంట్ సమీపంలోని రాఘవేంద్ర తోట వద్ద ఈ ప్రమాదం సంభవించింది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించే క్రమంలో బస్సు డ్రైవర్ ఎడమవైపు వెళ్లగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షంవల్ల రోడ్డు మెత్తబడి ఉండడంతో బస్సు అందులో ఇరుక్కుపోయింది. ఈ సంఘటనలో ఎవ్వరికి ప్రాణాపాయం లేకపోగా ఒక యువకుడు మరో వయోవృద్ధుడికి స్వల్పంగా గాయాలయ్యాయి. సంఘటన స్థలాన్ని రాయచూరు రూరల్ పోలీసులు పరిశీలించారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కొలమ్...

దాదాభాయ్ నౌరోజి (జయంతి)



'గ్రాండ్ ఓల్డ్‌మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరొందిన తొలి ఆసియా వ్యక్తి దాదాభాయ్ నౌరోజీ 1825 సెప్టెంబరు 4న జన్మించారు. పార్సీ మతానికి చెందిన విద్యావేత్త, మేధావి, పత్తి వ్యాపారి, తొలితరం రాజకీయ, సామాజిక నాయకుడు. 1892 నుంచి 1895 వరకు పార్లమెంట్ సభ్యుడిగా యునైటెడ్ కింగ్‌డమ్ హౌస్ ఆఫ్ కామన్స్‌లో కొనసాగారు. 'స్వరాజ్య' అనే పదం తొలిసారిగా వాడింది ఆయనే. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఒకరు. బాలగంగాధర్ తిలక్, గోపాలకృష్ణ గోఖలేలకు రాజకీయ గురువు. తొలితరం పారిశ్రామికవేత్త జేఆర్‌డీ టాటా లాంటి వారికి మార్గ దర్శి 1917 జూన్ 30న కన్నుమూశారు.

రిషి కపూర్ (జయంతి)



ప్రముఖ హిందీ సినిమా నటుడు, దర్శకుడు రిషి కపూర్ 1952 సెప్టెంబరు 4న ముంబైలోని చెంబూర్ ప్రాంతంలో జన్మించారు. తండ్రి రాజ్‌కపూర్ దర్శకత్వంలో 1970లో తీసిన 'మేరా నామ్ జోకర్' చిత్రంతో బాలనటుడిగా సినీరంగ ప్రవేశం చేశారు. ఈయన నటించిన పాత్రకు ఉత్తమ కళాకారుడిగా జాతీయ చలనచిత్ర పురస్కారం దక్కింది. డింపుల్ కపాడియాతో కలసి 'బాబీ' సినిమాలో యువ ప్రేమికుడిగా నటించారు. నటి నీతూ సింగ్‌ను పెళ్లాడారు. 50 ఏళ్లలో పదు లసంఖ్యలో సినిమాలలో నటించి నాలుగు ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, ఇతర పురస్కారాలు అందుకున్నారు. 2020 ఏప్రిల్ 30న కన్నుమూశారు.

మోహన్ కందా (పుట్టినరోజు)



మోహన్ కందా 1945 సెప్టెంబరు 4న చెన్నైలో జన్మించారు. ఐఏఎస్ అధికారిగా ప్రభుత్వంలో పలు కీలకమైన పదవులు చేపట్టారు. ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ అందుకున్నారు. జాయింట్ కలెక్టర్ స్థాయి నుంచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వరకూ వివిధ హోదాల్లో పనిచేశారు. జాతీయ విపత్తుల నిర్వహణా అథారిటీ (ఎన్‌డీఎంఏ) ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. కాగా కొన్ని సినిమాలలో బాల నటుడిగా నటించారు. పలు పుస్తకాలు రాశారు. కోనసీమ రైతులు పంట విరామం ప్రకటించినప్పుడు రైతుల సమస్యలపై అధ్యయనంకై ఏర్పాటైన కమిటీకి అధ్యక్షత వహించారు.

అనంత్‌నాగ్ (పుట్టినరోజు)



ప్రముఖ నటుడు అనంత్‌నాగ్ 1948 సెప్టెంబరు 4న ఉత్తరకన్నడ జిల్లా శిరాలి ప్రాంతంలో జన్మించారు. నాటకం, వెండితెర, బుల్లి తెరపైనా రాణించారు. కన్నడలో 200కుపైగా, తెలుగు, మరాఠీ, తమిళ, మళయాళం, హిందీ భాషల సినిమాల్లో కలిపి 300కుపైగా సినిమాల్లో నటించారు. ఐదు కర్ణాటక స్టేట్ ఫిల్మ్ అవార్డులు, 6 ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు అందు కున్నారు. ఆర్‌కె నారాయణ్ రచించిన మాల్గుడి డేస్‌లో సోదరుడు శంకర్‌నాగ్ దర్శకత్వంలో బుల్లితెరపై నటించి రాణించారు.

బెంగళూరును విశ్వ పారిశ్రామిక నగరిని చేద్దాం

▸▸ ఐటీ, బీటీ శాఖల మంత్రి ప్రియాంక ఖర్గే పిలుపు



బెంగళూరు టెక్ సమ్మిట్ సన్నాహకసభలో మంత్రి ప్రియాంక ఖర్గే తదితరులు

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు టెక్ సమ్మిట్ ద్వారా నగరాన్ని విశ్వ పారిశ్రామిక కేంద్రంగా చేద్దామని అందుకు తగిన మౌలిక సదుపాయాలను సమకూర్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఐటీబీటీశాఖల మంత్రి ప్రియాంక ఖర్గే అభిప్రాయపడ్డారు. బెంగళూరు టెక్ సమ్మిట్‌పై నగరంలో మంగళవారం గ్లోబల్ ఇన్నోవేషన్ అలయెన్స్, భాగస్వాముల సదస్సు జరిగింది. ఆస్ట్రేలియా, డెన్మార్క్, ఇజ్రాయెల్, జపాన్, స్విట్జర్లాండ్, యుఎస్ఏ, యూకే కాన్సుల్ జనరల్స్ భాగస్వాములయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ప్రియాంక ఖర్గే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎలక్ట్రానిక్స్, ఐటీబీటీ రంగాలలో గణనీయమైన ప్రగతి సాధ్యం చేస్తోందన్నారు. 2018లో పది దేశాల భాగస్వామ్యం ఉండగా ప్రస్తుతం 30కుపైగా దేశాలు పాల్గొంటున్నాయన్నారు. నవంబరు 19నుంచి టెక్ సమ్మిట్ జరగనుందన్నారు. అందుకు తగిన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. అంతర్జాతీయస్థాయిలో సాంకేతిక సామర్థ్యాల ప్రదర్శనకు ఇదో వేదిక కానుందన్నారు.

మహదాయి జల వివాదంలో రాష్ట్రానికి మళ్లీ కష్టాలు

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో జన్మించి గోవా రాష్ట్రానికి ప్రధాన తాగునీటి వనరు అయిన మహదాయి జలవివాదంలో చుక్కెదురైంది. మహదాయి నది జలాలను కళసా-బండూరి కాలువల అనుసంధానం చేసేందుకు దశాబ్దాలుగా సాగుతున్న వివాదానికి మరోసారి అడ్డుపడినట్టయ్యింది. కళశ కాలువకు నీటిని మళ్లించే పనులకు జాతీయ వన్యజీవి మండలి నిరాకరించింది. కర్ణాటకలో 435 ఎకరాల అటవీభూమి వినియోగించే గోవా - తమ్నార్ 400కెవి విద్యుత్ మార్గానికి మండలి షరతులతో అంగీకరించింది. గోవాలో అదనపు విద్యుత్ లైన్‌ల ఏర్పాటుకు కర్ణాటక అటవీప్రాంతాన్ని వినియోగించుకునేందుకు వ్యతి రేకత వ్యక్తం చేశారు. వన్యజీవిమండలి నిర్ణయంతో కర్ణాటకకు చేదు అనుభవం మిగల్చగా గోవాకు కలసివచ్చి నట్టయ్యింది. కేంద్ర అటవీ, పర్యావరణశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అధ్యక్షతన సోమవారం జాతీయ వన్యజీవి మండలి 79వ సభలో తీర్మానించారు. ఈ ప్రాజెక్టు పరి ష్కరింపబడి డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టుకు కేంద్ర జల కమిషన్ 2022 డిసెంబరు 29న అంగీకరించింది. ఇందులో కళశ కాలువ ద్వారా మళ్లించే ప్రాజెక్టులో 1.78 టీఎంసీల నీటిని రిజర్వు చేశారు. ఈ ప్రాజెక్టు బెళగావి జిల్లా ఖానాపుర తాలూకాలోని 7 గ్రామాలలో అటవీభూమిలో జాక్‌వెల్ నిర్మాణం, పంప్‌హౌస్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్, పైప్‌లైన్‌కు అంగీకరించాలని రాష్ట్ర ప్రభుత్వం వన్యజీవిమండలికి ప్రస్తా వనలు పంపింది. ఈ ప్రాజెక్టు పరిధిలో సహ్యాద్రి పులుల సంరక్షణ ప్రదేశం 10.68 హెక్టార్ల విస్తీర్ణాన్ని వినియోగించు కోవాల్సి ఉంటుందని ప్రస్తావనలో స్పష్టం చేశారు. అందుకు మండలి అంగీకరించలేదు. మహదాయి ప్రాజెక్టు ప్రాంతంలో వాస్తవాలపై అధ్యయనం చేసేందుకు జాతీయ పులుల సంరక్షణా ప్రాధికార నిపుణుల బృందాన్ని పంపింది. ఈ కమిటీ పలు సిఫారసులను చేసింది. పులుల సంరక్షణ ప్రాధికార నుంచి కూడా అభిప్రాయాన్ని కోరింది. సబ్‌జ్యుడీస్ కానుందని వన్యజీవి మండలి తేల్చి చెప్పింది. కర్ణాటక ప్రభుత్వ ప్రాజెక్టుపై గోవా ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటీషన్ దాఖలు చేసిందని, రాష్ట్ర అటవీశాఖ అదనపు ప్రిన్సిపల్ సెక్రటరీ తెలిపారు. చర్చల తర్వాత తదుపరి సభలో నిర్ణయి స్తామన్నారు. ధారవాడకు అనుబంధమైన నరేంద్ర నుంచి గోవాకు 400 కెవి సామర్థ్యం కల్గిన విద్యుత్‌లైన్ నిర్మించేందుకు సిద్ధమైన గోవా - తమ్నార్ విద్యుత్ ప్రాజెక్టుకు వన్యజీవిమండలి షరతులతో కూడి అనుమతులు ఇచ్చింది. ఈ ప్రాజెక్టుకు భగవాన్ వన్యజీవిధామ 27 హెక్టార్ల అటవీ భూమి వినియోగానికి గోవా ప్రభుత్వం అంగీకరించింది. ప్రస్తుతం వన్యజీవి మండలి నుంచి అనుమతులు దక్కాయి. ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో 435 ఎకరాల అటవీభూమి వినియోగానికి ప్రస్తావించారు. విద్యుత్‌లైన్‌లు ఏర్పాటు చేసే ప్రాంతాలలో దాండేలి ఏనుగుల కారిడార్, భీమగడ అభయారణ్యం, పరిసరాలు, సూక్ష్మ వలయంగాను దాండేలి అభయారణ్యం ద్వారా ఏర్పాటు చేస్తే భారీ ప్రమాణంలో అటవీసంపదకు నష్టం జరగనుంది. కర్ణాటక పరిధిలో ప్రాజెక్టు ప్రస్తావనలకు మండలి స్థాయి సమితి సిఫా రసులు చేసే వరకు నిర్మాణాలు చేపట్టరాదని ప్రాజెక్టు చేపట్టే సంస్థకు షరతులు విధించింది. విద్యుత్‌లైన్‌లను నిర్మించేందుకు గోవా-తమ్నార్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు లిమిటెడ్, కర్ణాటక ప్రభుత్వానికి 2019లోనే ప్రస్తావించారు. 2020లో ఈ ప్రాంతంలో లైన్ ఏర్పాటు చేస్తే అటవీ ప్రాంతంలో వన్యజీవులపై ప్రభావం చూపుతుందని ప్రస్తావనలను తిరస్కరించారు. ఇటీవలే కేంద్రం డిపి ఆర్‌కు అంగీ కరించగా సంతోష పడిన పలు గ్రామాల ప్రజలకు వన్య జీవిమండలి నిర్ణయం షాక్ ఇచ్చినట్టయ్యింది.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి : ఏసీపీ



కుర్చీలు అందచేస్తున్న ఏసీపీ రాజేశ్

బొమ్మనహళ్ళి, సెప్టెంబరు 3: ఇటీవలికాలంలో సైబర్ నేరాలు అధికమయ్యాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏసీపీ రాజేశ్ అభిప్రాయపడ్డారు. హెచ్‌ఎస్ఆర్ లే అవుట్‌లో రాజలాంచన సంస్థ మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యావంతులు సైతం ఎక్కువగా సైబర్ నేరాలకు గురవుతున్నారన్నారు. పలు రకాలుగా సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మొబైల్‌కు వచ్చే అనవసరమైన సందేశాలకు స్పందించవద్దన్నారు. దేశంలోనే ఎక్కువగా సైబర్ నేరాలు బెంగళూరులో చోటు చేసుకోవడం విచారకరమన్నారు. ప్రజలలో మార్పు రావాలన్నదే తన ఆశయమన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలలో రాజలాంచన సంస్థ ఐదేళ్లుగా సామాజిక సేవలు అందిస్తోందని చదువు, విద్యారంగాలను ప్రోత్సహించడంతోపాటు పచ్చదనం పెంపొందేందుకు పాటుపడుతోందన్నారు. ఇదే సందర్భంగా ఆయన పుట్టినరోజును పురస్కరించుకుని 140మంది రక్తదానం చేయగా ఆరోగ్య శిబిరంలో పలువురు ప్రయోజనం పొందారు. సంస్థ సామాజిక సేవలను ప్రశంసించారు. రాజలాంచన సంస్థ సామాజిక సేవలకు గాను లక్ష రూపాయల విరాళాన్ని రాజేశ్ తల్లి ప్రకటించారు. కాగా బెంగళూరు నగర, గ్రామీణ ప్రాంతాలలో విస్తరించనున్నట్లు రాజలాంచన సంస్థ నిర్వాహకులు వెల్లడించారు. సర్జాపుర పాఠశాలకు పుస్తకాలు, ఇచ్చంగూరు ప్రభుత్వ పాఠశాలకు చిన్నారులకు కుర్చీలు అందచేశారు. స్థానిక యువ కాంగ్రెస్ నాయకుడు అనిల్‌రెడ్డి, శ్రీనివాస్ ఇతర పోలీసు అధికారులు తదితరులు ఏసీపీ రాజేశ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాజలాంచన సంస్థకు చెందిన విద్య, చంద్రశేఖర్, వసంతకుమార్, శేఖర్, హర్ష, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలివ్వాలని టోల్‌గేట్ వర్కర్స్ ధర్నా



ధర్నాలో యూనియన్ సభ్యులు

బాగేపల్లి, సెప్టెంబరు 3: ఏళ్ల తరబడి పనిచేస్తున్నా కనీస వేతనానికి నోచుకోవడం లేదని, దౌర్జన్యాలు పెరిగాయని వాపోతూ టోల్‌గేట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు ముస్తఫా ఆక్రోశం వ్యక్తం చేశారు. పట్టణ శివారులోని జాతీయ రహదారి 44పై నారేపల్లి టోల్‌ప్లాజా వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో టోల్‌గేట్ వర్కర్స్ యూనియన్ సభ్యులు ధర్నా చేపట్టారు. డిమాండ్లను పరిష్కరించకుంటే టోల్‌గేట్‌నే మూసివేస్తామని హెచ్చరించారు. టోల్‌ప్లాజాలో 15ఏళ్లుగా పనిచేస్తున్నామని, కనీస సదుపాయాలను కల్పించడంలో కంట్రాక్టు సంస్థ నిర్లక్ష్య ధోరణి వ్యవహరిస్తోందన్నారు. ఇక్కడ పనిచేసే ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలని, పర్మనెంట్ చేయాలని, పీఎఫ్, బోనస్, నాణ్యమైన యూనిఫాం, షూ, సాక్స్, పిల్లలకు ఉచిత విద్య, స్కాలర్‌షిప్ తదితర సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి సురేశ్‌సింగ్ మాట్లాడుతూ 15ఏళ్లుగా పనిచేస్తున్నామని, విధులకు బదులు చాకిరీలా మారిందన్నారు. రూ.9 వేలనుంచి 15వేల దాకా జీతం ఇస్తున్నారన్నారు. కాగా ప్రతినెలా 5న వేతనం ఇవ్వాలని, కనీస కూలి చొప్పున నెలకు రూ.24 వేలు జీతం ఇవ్వాలని, ప్రతి ఏడాది బోనస్ ఇవ్వాలని, ప్రతి ఆరు నెలలకోసారి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈనెల 15న టోల్‌ఫ్రీ మేనేజర్ రానున్నారని వారితో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామని నిర్వాహకులు బదులిచ్చారు. సీఐటీయూ అధ్యక్షుడు శంకరరెడ్డి, ప్రముఖులు ఓబళరాజు, టోల్‌గేట్ సిబ్బంది ఇర్ఫాన్, సురేశ్, శ్రీనివాస్, సోమశేఖర్, గంగరాజు, నరేశ్, వెంకటేశ్, శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించి గ్రామానికి పేరు తేవాలి



విజేతలకు పుస్తకాలు, ప్రశంసాపత్రాలు అందజేత

శిడ్లఘట్ట, సెప్టెంబరు 3: మన ఊరి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అనేక క్రీడా పోటీల్లో ప్రథమస్థానంలో నిలవడం గ్రామానికి గర్వకారణమని రానున్న రోజుల్లో విద్యార్థులంతా ఎక్కువ బహుమతులు సాధించి గ్రామానికి మరింత కీర్తిప్రతిష్ఠలు తేవాలని గ్రామ నాయకుడు రవి బి.గౌడ వెల్లడించారు. తాలూకాలోని మళమాచనహళ్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఇటీవల నిర్వహించిన హోబళి స్థాయి క్రీడాపోటీలు, క్లస్టర్ స్థాయి ప్రతిభా కారంజిలో అనేక క్రీడా పోటీల్లో ప్రథమస్థానం నిలిచారన్నారు. దీన్ని గమనించి విద్యార్థులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వపాఠశాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోవడం లేదన్నారు. గ్రామపంచాయతీ పీడీఓ శైల మాట్లాడుతూ విద్యార్థి జీవనంలో కేవలం పాఠ్యపుస్తకాలు చదవడానికి పరిమితం కారాదని, సాంస్కృతిక, క్రీడా కార్యక్రమాల్లో పాల్గొని ప్రతిభను చాటుకోవాలన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మరిన్ని బహుమతులు పొందాలని అభిలషించారు. గెలుపొందిన విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్, క్రీడలకు వీలుగా స్పోర్ట్స్ షూలను రవి బి గౌడ అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌డిఎంసి అధ్యక్షుడు మునేగౌడ, నామినేటెడ్ సభ్యుడు, ఎంపిసిఎస్ అధ్యక్షుడు రామచంద్రచారి, మునిశామిగౌడ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువతలో క్రీడాసక్తి పెరగాలి



క్రీడా పోటీల్లో విజేతలతో ఉపాధ్యాయులు

విజయపుర, సెప్టెంబరు 3: యువతలో క్రీడాసక్తి పెరగాలని జిల్లా శరణ సాహిత్య పరిషత్‌కు చెందిన చంద్రశేఖర హడపద అభిప్రాయపడ్డారు. అఖిల కర్ణాటక మిత్ర సంఘం, శరణ సాహిత్య పరిషత్ సహకారంతో ప్రభుత్వ బాలికల పాఠశాలలో ఏర్పాటైన జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోబళి స్థాయి క్రీడాపోటీల విజేతలను ఉద్దేశించి మాట్లాడారు. మనదేశం ఒలింపిక్స్‌లో బంగార పతకం సాధించడం ద్వారా హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ సాధనల గురించి వివరించారు. అఖిల కర్ణాటక మిత్రసంఘం అధ్యక్షుడు చి.మా. సుధాకర మాట్లాడుతూ పిల్లల్లోని న్యూనతాభావం ఒలగించి స్నేహభావం పెంపొందించేందుకు క్రీడలు సహకరిస్తాయన్నారు. కార్యదర్శి మునిరాజు మాట్లాడుతూ విజయపుర కీర్తి ని పెంచేలా బాలికలు గొప్ప క్రీడాకారులు కావాలని, ఒలింపిక్స్ విజేతలను మాదిరిగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యాయులు పాల్గొ న్నారు. కబడ్డీ జట్టు కేప్టెన్ యమునా, రిలే బృందం స్పందన, లక్ష్మీదేవమ్మ, హోబళిస్థాయి క్రీడాకారులను అభినందించారు.

దివ్యాంగులకు ఉపకరణాల వితరణ



వీల్‌చెయిర్లు, ఇతర ఉపకరణాలను అందజేస్తున్న అభిమానులు

దొమ్మసంద్ర, సెప్టెంబరు 3: ఆనేకల్ తాలూకా బిల్లాపుర గ్రామపంచాయతీ పరిధిలోని బూరుకుంటె గ్రామంలోని సాయిగార్డెన్ లే అవుట్‌లోని మాతృఫౌండేషన్ దివ్యాంగుల హాస్టల్‌లో పవర్‌స్టార్, ఏపీ డీసీఎం పవన్‌కల్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని పలు ఉపకరణాలు అందజేశారు. పవన్‌కల్యాణ్ అభిమానుల సేవా సమితి ఆధ్వర్యంలో దివ్యాంగ పిల్లలకు వీల్‌చెయిర్, వీల్ సైకిల్, అవసరమైన ఉపకరణాలు, నిత్యావసరాలు అందచేశారు. అలాగే సోమవారం అన్నదాసోహం నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. సమితి సంస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు మిథన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మంజునాథ్, ఎస్ఎం కౌశిక్, రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి గౌరిశంకర్, రాష్ట్ర కార్యదర్శి గబ్బర్, రా.కా.మురళి, నిఖిల్, ప్రవీణ్, అత్తిబెలె మురళి, పదాధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన పాలు అందించండి

బంగారపేట, సెప్టెంబరు 3: పాడిరైతులు నాణ్యమైన పాలను సహకార సంఘాలకు అందించడం ద్వారా అభివృద్ధికి దోహదపడాలని సంఘం విస్తరణాధికారి కిరణ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. ఆలూకాలోని దొడ్డ అంకండహళ్ళి పాల ఉత్పత్తిదారుల మహిళా సహకార సంఘం అధ్యక్షురాలు రత్నమ్మ నేతృత్వంలో నిర్వహించిన సర్వసభ్య వార్షిక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. పశువుల కూడా మంచి ఆహారం అందించడం ద్వారా పాల నాణ్యతను కాపాడాలన్నారు. పాల ఉత్పత్తిదారుల సంఘానికి 2023-24 సంవత్సరానికి 3 లక్షల రూపాయలకుపైగా నికరలాభం వచ్చిందన్నారు. పాడిరైతులను ప్రోత్సహించేలా ప్రభుత్వం ప్రోత్సాహకధనం ఇస్తోందని అంతే కాకుండా సంఘం ద్వారా ఫీడ్, పచ్చిమేత, విత్తనగింజలు ఇస్తున్నారని సద్వినియోగం చేసుకుని మంచి లాభాలు గడించాలన్నారు. రైతులు తమ పశువులకు సమాఖ్య ద్వారా బీమా చేయించుకోవాలన్నారు. దొడ్డఅంకండహళ్ళి సంఘం ఎంతోమందికి బీమా చేయించిందన్నారు. ఏడాదికి రెండుకంతులు జనవరి, జూన్‌లలో చెల్లిస్తున్నామన్నారు. పశువులకు ఏమైనా అకస్మాత్తుగా ప్రాణాపాయం చోటు చేసుకుంటే బీమా అనేది ఉపయుక్తం కాగలదన్నారు. గ్రామపంచాయతీ సభ్యుడు బాబు మాట్లాడుతూ పాల ఉత్పత్తిదారుల సహకార సంఘానికి సొంత భవనం లేదని, ఇకనైనా చొరవ చూపాలని కోరారు. ప్రభుత్వం వెంటనే స్థలాన్ని గుర్తించి సహకారసంఘానికి కొత్త భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పాల ఉత్పత్తిదారుల మహిళా సంఘం అధ్యక్షురాలు రత్నమ్మ, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవి, డైరెక్టర్‌లు జయమ్మ, నారాయణమ్మ, పుష్ప, సుశీలమ్మ, జయమ్మ స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

మాకు టీచర్ లేదు... మీరే పాఠాలు చెప్పండి


▸▸ బీఈఓ ఆఫీసు ఎదుట విద్యార్థుల నిరసన



విద్యార్థుల నిరసన, మరోవైపు పాఠశాలకు తాళం

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మాకు టీచర్ లేరని ఎలా చదువుకోవాలని మీరే పాఠాలు చెప్పాలంటూ బీఈఓ ఆఫీసులో విద్యార్థులు డిమాండ్ చేశారు. చిక్కమగళూరు జిల్లా హాళవత్తి గ్రామంలో ఉపాధ్యాయుడు లేక పాఠశాలకు తాళం వేశారు. దీంతో విద్యార్థులంతా చిక్కమగళూరు తాలూకా బీఈఓ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. ఇటీవలే ఇక్కడ పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లారు. 1 నుంచి 5 తరగతులదాకా 9మంది విద్యార్థులు ఉన్నారు. రెండు వారాలుగా పాఠశాల తెరవకపోవడంపై విద్యార్థులు సోమవారం నిరసన తెలిపారు. చివరకు బీఈఓ స్పందించి విద్యార్థుల తల్లిదండ్రులతో చర్చించి వెంటనే ఉపాధ్యాయుడిని నియమిస్తామని హామీ ఇచ్చారు.

అలరించిన ప్రతిభాకారంజి



విద్యార్థుల వేషధారణలు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 3: శిడ్లఘట్ట తాలూకా పలిచేర్లు గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ప్రతిభా కారంజి నిర్వహించారు. విద్యార్థులు కన్నడ మాత, ఒనకె ఓబవ్వ, సుభాష్‌చంద్రబోస్, శ్రీకృష్ణుడు, తదితర వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమానికి గంగరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథులుగా దేవరాజ్, రామక్క, మీనా వెంకటేశ్, గ్రామపంచాయతీ సభ్యులు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

80 శాతం సబ్సిడీతో ఉలవల పంపిణీ

మడకశిర రూరల్, సెప్టెంబరు 3 : రైతులకు 80 శాతం సబ్సిడీతో ఉలవలు పంపిణీ చేస్తున్నట్లు వ్యవసాయశాఖ ఏఓ తిమ్మప్ప తెలిపారు. 10 కేజీల ఉలవల ప్యాకెట్ రూ.870 ఉందన్నారు. అందులో 80 శాతం సబ్సిడీ పోను రైతులకు కేవలం రూ.174కు అందిస్తున్నామన్నారు. అసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసు కోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏరో విభాగం డైరెక్టర్ జనరల్‌గా రాజలక్ష్మీ మీనన్



రాజలక్ష్మి మీనన్

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఏరో విభాగం డైరెక్టర్ జనరల్‌గా డాక్టర్ కె.రాజలక్ష్మీ మీనన్ నియమితులయ్యారు. ఈనెల 1న ఆమె పదోన్నతి పొందారు. సెంటర్ ఫర్ ఎయిర్ బోర్న్ సిస్టమ్స్ (సిఎ బిఎస్) అదనపు బాధ్యతలతోపాటు ఆమె డీజీ హోదాలో కొనసాగనున్నారు. ఎయిర్‌బోర్న్ సర్వలెన్స్ సిస్టమ్స్ రూప కల్పనలో ఆమె ప్రత్యేక కృషి చేశారు. కాంప్లెక్స్ సిస్టమ్స్ కమాండ్ కంట్రోల్ కమ్యూనికేషన్స్, కంప్యూటర్స్, ఇంటిలిజెన్స్ విభాగంలో ఆమె గుర్తింపు పొందారు. యూఏవీలు, ఫైటర్‌లు, ఉపగ్రహాలు, మనుషులకోసం ఇమేజింగ్ రాడార్ రూపకల్పన విభాగానికి నాయకత్వం వహించారు. సిఎబిఎస్ అసోసియేట్ డైరెక్టర్‌గా ఆమె వివిధ ప్రాజెక్టులకు నాయకత్వం వహించారు. ఇంటెలిజెన్స్ నిఘా రికనైజెన్స్ (ఐఎస్ఆర్)కోసం సాంకేతికతను అభి వృద్ధి చేసే దిశగా ఎయిర్ టు గ్రౌండ్ సర్వలెన్స్ టెక్నాలజీ రూపకల్పనలో ఆమె కీలక భూమిక పోషించారు. ఏరోనాటికల్ సొసైటీ ఆఫ్ ఇండియా నుంచి 2018లో ఉత్తమ మహిళా శాస్త్రవేత్తగాను, 2019లో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సైన్సెస్ నుంచి పూర్వ విద్యార్థుల అవార్డును పొందారు. భారతదేశమంతటా స్టెమ్ 51 మహిళా సాధకులలో ఆమె ఒకరిగా ఉన్నారు. ఏరో డైరెక్టర్ జనరల్‌గా ఆమె నియమించబడడంపై డిఆర్‌డిఓ నగరంలో ఒక ప్రకటన విడుదల చేసింది.

పీఓపీ గణపతులు వాడొద్దు



కుట్టుమిషన్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మంజుల

మహదేవపుర, సెప్టెంబరు 3: ప్లాస్టర్ ఆఫ్ పారిస్, ఇతర రసాయన వస్తువులతో తయారుచేసిన గణపతి విగ్రహాలను విసర్జన చేయడం ద్వారా చెరువులు, బావులు కలుషితం అవుతాయని ఎమ్మెల్యే మంజుల అరవింద లింబావళి అభిప్రాయపడ్డారు. కిత్తగనూరు గ్రామ పంచాయతీ 2024-25 వార్షిక తొలి గ్రామసభను మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కిత్తగనూరు గ్రామపంచాయతీ నగరానికి అనుబంధంగా ఉండడంతో నగర ప్రాంతాల తరహాలో అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. వచ్చే గౌరి-గణేశ పండుగను పర్యావరణ స్నేహిగా ఆచరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇదే సందర్భంగా ప్రజల సమస్యలను ఆలకించారు. పంచాయతీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు సహాయధనం, ప్రతిభావంత విద్యార్థులకు ప్రోత్సాహకధనం, మహిళలకు కుట్టుయంత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాలూకా పంచాయతీ కార్యనిర్వహణాధికారి వసంత కుమార్, పీడీఓ నర్మదా, ఆరోగ్య, రెవెన్యూ, స్త్రీశిశుసంక్షేమ, పోలీసు తదితరశాఖల అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తగా మాట్లాడు... లేదంటే బట్టలూడదీస్తా..!

▸▸ మాజీ ఎమ్మెల్యేపై కాగవాడ ఎమ్మెల్యే ఆగ్రహం

బెంగళూరు, సెప్టెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెళగావి జిల్లా కాగవాడ మాజీ ఎమ్మెల్యే శ్రీమంతపాటిల్, సిట్టింగ్ ఎమ్మెల్యే రాజుకాగెల మధ్య సోమవారం మాటలయుద్ధం సాగింది. నీది అవినీతి రాజకీయమని శ్రీమంతపాటిల్ ఆరోపించారు. అందుకు ధీటుగా రాజుకాగె స్పందిస్తూ నాపట్ల మాట్లాడేందుకు అర్హత లేదని ప్రజలు నిన్ను తిప్పికొట్టారన్నారు. నాపట్ల మాట్లాడేముందు జాగ్రత్తగా ఉండాలని లేదంటే బట్టలూడదీస్తానని హెచ్చరించారు. బసవేశ్వర ఎత్తిపోతలతోపాటు పలు పనులు నాసి రకంగా జరిగాయనే అంశంపై వాగ్వాదం చేసుకున్నారు.

గంజాయి మొక్కలు స్వాధీనం



గంజాయి మొక్కలను తూకం వేస్తున్న పోలీసులు

శిడ్లఘట్ట, సెప్టెంబరు 3: తాలూకాలోని దిబ్బూరహళ్ళి పోలీస్‌స్టేషన్ పరిధిలో దింబారహళ్ళి - దానసరహళ్ళి సరిహద్దున మొక్కజొన్న తోటలో పెంచుతున్న గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. జనమడగు లంబు (55) అనే వ్యక్తి పెంచుతున్నట్టు గుర్తించారు. డీఎస్పీ మురళిధర మార్గదర్శకంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, దిబ్బూరహళ్ళి ఎస్ఐ శామలా, వెంకటరమణప్ప, సిబ్బంది దాడులలో పాల్గొన్నారు. సుమారు లక్ష రూపాయల విలువైన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు.